క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: సంపత్ నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 132 కేవీ టవర్ లైన్ కండక్టర్‌ను మార్పు చేసే పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం తెలిపారు. ఈ కారణంగా సంపత్ నగరం, కొండగుంటూరు, నామవరం, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, జి.యర్రంపాలెం, పాతతుంగపాడు, కొత్తతుంగపాడు అంతరాయం కలుగుతుందన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

సీతానగరం: మండలంలో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కూనవరం, శనివారం బొబ్బిల్లంక, 21న ఉండేశ్వరపురం, 22న జాలిమూడి, 23న సింగవరం, 24న వంగలపూడి, 25, 26న ముగ్గళ్ల, 28, 29న సీతానగరం, నవంబర్ 4, 5న నల్దొండ, 11, 12న నాగంపల్లి గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. పంట భూముల సమస్యలపై రైతులు ఈ సభల్లో ఫిర్యాదు చేసుకోవాలని కోరారు.

నందరాడలో దొంగతనాలు




చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్సై మనోహర్

రాజానగరం: నందరాడలోని రెండిళ్లలో బంగారం, నగదును దొంగలు మాయం చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన అడబాల సూర్యప్రకాశరావు సోమవారం ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో కలిసి గ్రామాంతరం వెళ్లాడు. తిరిగి గురువారం ఉదయం తిరిగి వచ్చేసరికీ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. కంగారుగా లోపలకు వెళ్లి చేస్తూ బీరువాలో దాచిన 10 కాసుల బంగారు నగలు, నగదు పోయినట్టు గుర్తించాడు. అలాగే ప్రకాశరావు ఇంటి వెనుక ఉన్న అతడి అన్నయ్య ఇంటిలో కూడా దొంగలు పడి, బంగారు నగలు, నగదును అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోహర్ తెలిపారు.

బ్రాందీ షాపు ఏర్పాటు చేస్తే అడ్డుకుంటాం

పెదపూడి: మండలంలోని కైకవోలు సెంటర్ వద్ద బ్రాందీ షాపు ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) కాకినాడ జిల్లా కమిటీ నాయకులు గుబ్బల ఆదినారాయణ, ఆర్.రాఘవులు గురువారం పేర్కొన్నారు. మండలంలోని కైకవోలు, కుమారప్రియం, కాండ్రేగుల, శహపురం, గండ్రేడు, పుట్టకొండ గ్రామాల నుంచి మండల కేంద్రం పెదపూడి రావడానికి ప్రధాన మార్గం కై కవోలు సెంటర్ అన్నారు. ఇక్కడ బ్రాందీ షాపు వస్తే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని సైతం గ్రామ ప్రజలు, ప్రజా సంఘాలు అడ్డుకున్నారన్నారు. ప్రభుత్వం ప్రైవేటు మద్యం షాపులకు పర్మిషన్ ఇచ్చినందు వల్ల కైకవోలు సెంటర్‌లో, పెదపూడి బ్రహ్మంగారి రేకుల షెడ్డులో బ్రాందీ షాపు ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో బ్రాందీ షాపులు ఏర్పాటు చేస్తే మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్మీకి జయంత్యుత్సవం

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ ఆది కావ్యమైన రామాయణం వ్యక్తిత్వ వికాస గ్రంథమన్నారు. మానవ జీవితానికి దిక్సూచి అయిన రామాయణ గ్రంథ పఠనంతో సమాజం శాంతిని పొందుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరే రామకృష్ణ మాట్లాడుతూ భారతీయ కుటుంబ జీవనానికి రామాయణం ఆదర్శప్రాయమన్నారు. తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎం.సుధామయి, అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, సుబ్బారావు, మాధవ్, షేక్ దర్గా మదీనా, వాణి పాల్గొన్నారు.

కోరుకొండ మండల అధికారులు

ఎంపీడీఓ	బత్తిన అశోక్ కుమార్ 94413 83567
తహసీల్దార్	సుస్వాగతం 80088 03195
వ్యవసాయశాఖ ఏడీ	మల్లికార్జునరావు 83310 56576
సీఐ	సత్య కిషోర్ 94409 04829
ఎస్సై	శ్యామ్ సుందర్ 94409 04831
ఎక్సైజ్ సీఐ	శ్రీనివాస బాలాజీ 98484 42997

అన్నదాతల గుండెల్లో గుబులు

- రైతన్నలను వెంటాడుతున్న వరుస అల్పపీడనాలు
- ప్రస్తుతం పొట్ట దశలో వరి పంట
- వీడని వర్షాలతో నానా అవస్థలు పడుతున్న కర్షకులు



ఊలపల్లిలో నేలకొరిగిన వరి పంట

బిక్కవోలు: ప్రకృతి విపత్తుల నుంచి పంటను కాపాడుకోవడం అన్నదాతలకు సవాల్‌గా మారింది. ఖరీఫ్ పంట పొట్ట దశలో ఉంది. గత కొద్దిరోజులుగా వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురవడంతో రైతులకు కంటి మీద కునుకు లేదు. గురువారం తిరుపతి జిల్లా తడ వద్ద వాయుగుండం తీరం దాటేయడంతో హమ్మయ్య అనుకున్నారు. మరోవైపు ఈ నెలలోనే మరో రెండు అల్పపీడనాలు ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణశాఖ అధికారులు చెబుతుండడం కర్షకులను మరింత ఆందోళనకు గురి చేస్తుంది. ఈ నెల 21న తూర్పు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి వాయువ్య దిశగా పయనించి 24వ తేదీన ఒడిశాకు చేరువవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతేకాదు నెలాఖరున పసిఫిక్ మహాసముద్రంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశముంది. 25వ తేదీనాటికి అల్పపీడనంగా ఏర్పడి 26వ తేదీన తూర్పుమధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారొచ్చని చెబుతున్నారు. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో పంట దెబ్బతింటుందని భయపడుతున్న అన్నదాతలకు మళ్లీ అల్పపీడనాలు ఏర్పడతాయన్న హెచ్చరికలతో గుబులు పట్టుకుంది.

వర్షం వస్తుందంటే భయం

ఈ ఏడాది ఖరీఫ్ పంటకు ప్రకృతి సహకరించడం లేదు. ఖరీఫ్ ప్రారంభంలోనే పదే పదే వర్షాలతో నారుమడులు దెబ్బతిని రెండోసారి నారు పోసుకుని నాటుకోవాల్సి వచ్చింది. ఆ తరువాత కూడా పదే పదే భారీ వర్షాలు రావడంతో పంటకు తెగుళ్లు చుట్టుముట్టాయి. అన్నదాతలు ఆయా తెగుళ్లకు మందులు పిచికారీ చేసుకుని కాపాడుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట పొట్ట దశలో ఉంది. ఈ దశలో మళ్లీ వరుసగా అల్పపీడనాలు, భారీ వర్షాల కారణంగా పంట చేతికొస్తుందా అన్న సందేహాలు రైతుల నుంచి వ్యక్తమవుతోంది. భారీ వర్షాల కారణంగా ఇప్పటికే అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో సుమారు 2,000 ఎకరాల్లో పంట నేలకొరిగిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అందని పెట్టుబడి సాయం

అన్నదాతలకు ఆసరాగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పీఎం కిసాన్‌తో కలిపి రైతు భరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయంగా ఇచ్చేవారు. కౌలు రైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సాయం అందించేది. ఏటా మే నెలలోనే పెట్టుబడి సాయం మొదటి విడత అందించి అన్నదాతలను ఆదుకునేవారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చినా తుంగలో తొక్కేసింది. దీంతో వరుస విపత్తులతో అల్లాడుతున్న రైతులు అధిక పెట్టుబడుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మే నెలలో అందించాల్సిన పెట్టుబడి సాయం అక్టోబర్ నెల గడుస్తున్నా ఇవ్వకపోవడంతో చంద్రబాబు ప్రభుత్వంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వర్షాలు ఎక్కువగా వస్తున్నప్పుడు వరి చేలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. మడులలో నీరు బయటకు పోయే మార్గాలు ఏర్పాటు చేసుకోవాలి. గ్రామ వ్యవసాయ సలహాదారుల సూచనలు పాటించాలి. వర్షాలు తగ్గే వరకూ రైతులు అప్రమత్తంగా ఉంటే మంచిది.

– శామ్యూల్ జాన్, వ్యవసాయశాఖ ఏఓ, బిక్కవోలు

పాఠశాలకు ఇన్వెర్టర్ అందజేత



ఇన్వెర్టర్‌ను అందజేస్తున్న దాత అప్పారావు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కంభంపాటి అప్పారావు తన భార్య యనమండ్ర అన్నపూర్ణ జ్ఞాపకార్థం పాఠశాలకు సుమారు 20,000 విలువజేసే ఇన్వెర్టర్, రూ.5,000 విలువైన తాళం కప్పలను పాఠశాలకు బహూకరించారు. ఇన్వెర్టర్‌ను హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్‌కు గురువారం అందజేశారు.

షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు



రంగంపేట: మండల పరిధిలోని పెద రాయవరం గ్రామంలో కొలువై యున్న షిరిడీ సాయి ఆలయంలో బాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సాయిబాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీరంగపట్నం విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి చెస్, వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలోని పీఆర్ డిగ్రీ కాలేజీలో అక్టోబర్ ఒకటిన నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ – 19 చెస్, వాలీబాల్ క్రీడల్లో వీరు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో నంద్యాల, విజయవాడలో ఈ నెల 25న జరిగే అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో తలపడనున్నారు. ఈ మేరకు ఆ విద్యార్థులను గురువారం స్కూల్ హెచ్ఎం ఎస్. వెంకటేశ్వరరావు, వ్యాయామోపాధ్యాడు ఎస్‌వీవీ సత్యనారాయణ, సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్ మద్దాల దుర్గారావు, నాయకులు తనకాల నాగేశ్వరరావు, మద్దాల రమణ అభినందించారు.

వైద్యరంగంలో ఫిజియోథెరపీకి ప్రత్యేక స్థానం



విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న ప్రముఖులు

రాజానగరం: వైద్యరంగంలో ముఖ్యంగా ఆర్థో విభాగంలో ఫిజియోథెరపీకి ప్రత్యేక స్థానం ఉందని రాష్ట్ర ఆర్థోమెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్ అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో గురువారం సాయంత్రం జరిగిన ఫిజియోథెరపీ స్నాతకోత్సవంలో విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఫిజియోథెరపీ కోర్సు చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ రంగానికి మహిళలు ఎక్కువగా రావడం హర్షణీయమన్నారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడి, చికిత్సలు పొందిన వారు వేగంగా కోలుకునేందుకు ఫిజియోథెరపీ అవసరం ఉంటుందన్నారు. రోగులకు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంలో ఫిజియోథెరపిస్టులు కీలకపాత్ర వహిస్తారన్నారు. సినీ నటుడు, యోగా సాధకుడు, స్ట్రెస్ థెరపిస్టు డాక్టర్ భద్రం మాట్లాడుతూ వైద్యంలో ఎంతో కీలకమైన ఈ రంగంలోని వారు నిరంతరం విద్యార్థిగా ఉండాలన్నారు. రోగులకు ఆప్యాయతను అందించే ఆప్తులుగా వ్యవహరించాలని సూచించారు. డాక్టర్ గన్ని భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 108 మంది ఫిజియోథెరపీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మిశ్రా, స్వతంత్ర, జీఎస్ఎల్ ఆస్పత్రి సూపరింటిండెంట్లు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ టీవీఎస్పీ మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



రంగంపేట హైస్కూల్లో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

రంగంపేట: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి బాలికలకు వక్తృత్వ, వ్యాసరచన, వేషధారణ అంశాలపై పోటీలు జరిగాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి, ఉపాధ్యాయులు ఎం.సత్యదేవి, డి.రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణాంజలి, గుల్జార్‌బేగం, ఐసీడీఎస్ సిబ్బంది జానకి, దీన, పుష్పవతి, జి.పద్మకుమారి పాల్గొన్నారు.

డీపీవో మృతితో విషాదఛాయలు



బొమ్మూరులో ఇటీవల జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాసరావు (ఫైల్)



డీపీవో శ్రీనివాసరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పంచాయతీ అధికారి బొబ్బరాడ శ్రీనివాసరావు (57) మృతితో గురువారం జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. విశాఖ జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఆయన గత నెల 30వ తేదీన బదిలీపై జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ 16 రోజుల్లోనే బాధ్యతాయుతంగా పనిచేసి కలెక్టర్ నుంచి పంచాయతీ కార్యదర్శుల వరకూ అందరికీ ఆదర్శప్రాయుడిగా నిలిచారు. విశాఖపట్నం కూర్మన్నపాలెం ఆయన స్వస్థలం. 1999లో ముమ్మిడివరం ఎంపీడీవోగా ప్రభుత్వ సర్వీసులో చేరి పెద్దాపురం ఎంపీడీవోగా, విశాఖపట్నం జిల్లాలో జిల్లా పరిషత్ అకౌంట్స్ ఆఫీసర్‌గా, డిప్యూటీ సీఈవోగా, డ్వామా పీడీగా విధులు నిర్వహించారు. ఆయనకు భార్య రాజకుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టు 11వ తేదీన ఆయన చిన్న కుమార్తె వివాహం రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు కుమారుడితో జరిగింది.

పలువురి నివాళి

జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు మృతి వార్త తెలియగానే జిల్లా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఆయన పార్థివ దేహానికి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డీఆర్‌వో నరసింహులు, జిల్లా గిరిజన సంక్షేమసాధికారిత అధికారి కె.నాగజ్యోతి, డీఎల్‌పీవోలు నాగలత, అమ్మాజీ, ఈవోపీఆర్‌డీలు నివాళులర్పించారు.

విశాఖకు తరలింపు

డీపీవో శ్రీనివాసరావు పార్థివదేహాన్ని స్వస్థలమైన విశాఖపట్నంలోని కూర్మన్నపాలేనికి ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కుటుంబసభ్యులు విశాఖకు తరలివెళ్లారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నారు.

ఎంతో బాధాకరం

జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు మృతి బాధాకరమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీపీవో శ్రీనివాసరావు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు నివాళులు అర్పించారు.

సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ ధర్నా



జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావుకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులలో అర్హులైన వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులను అర్బన్ ఎంఈవోలు నియమించాలని, మున్సిపల్ టీచర్ల బదిలీలు వెంటనే చేపట్టాలని, మున్సిపల్ టీచర్లకు జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని, మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడుతూ ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యూటేషన్ ప్రాతిపదికన అధ్యాపక పోస్టుల భర్తీ కోసం పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అర్హత కలిగిన మున్సిపల్ ఉపాధ్యాయులను అనుమతించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే అక్టోబర్ 24న విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్. రవిబాబు, డి.శ్రీమణి, రమేష్ బాబు, నగర అధ్యక్షులు జేవీ అప్పారావు, ప్రధాన కార్యదర్శి జేవీవీ సుబ్బారావు, నరేష్, జేడీ సుహాసిని, తేజ విజయ్ కుమార్, ప్రసన్నేశ్వరి పాల్గొన్నారు.

చంటియ్య కుటుంబానికి పరామర్శ

కడియం: నర్సరీ రంగ ప్రముఖుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) మృతి తీరని లోటు అని రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆయన గురువారం కడియపులంకలో చంటియ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చంటియ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

గంబూషియా చేపల విడుదల

కడియం: దోమల లార్వా నిర్మూలనా చర్యల్లో భాగంగా వేమగిరిలోని పలు ప్రాంతాలలో గురువారం గంబూషియా చేపలను విడుదల చేసినట్లు ఆరోగ్య విస్తరణాధికారి ఎంవీబీ రామకృష్ణ తెలిపారు. గుత్తుల వెంకటస్వామి కాలనీ, వాటర్ ట్యాంక్ ఏరియాల్లోని నిల్వ నీటిలో ఈ చేపలను వదిలిపెట్టామన్నారు. దోమల లార్వాలను ఈ చేపలు తినేస్తాయని, తద్వారా దోమల సంతతి అభివృద్ధి ఆగిపోతుందని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసు, గుత్తుల కృష్ణ, వాసంశెట్టి బాలాజీ, అనసూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సదా మీ సేవలో..

- మహిళల భద్రతకు పోలీసుల ప్రాధాన్యం
- మహిళా రక్షక్ బృందాల ఏర్పాటు
- రద్దీ ప్రాంతాలలో గస్తీ
- ఎస్పీ స్వీయ పర్యవేక్షణ



మహిళా రక్షక్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు (ఫైల్)

కంబాలచెరువు: మహిళల భద్రతకు భరోసా కల్పించాలన్న లక్ష్యంతో మహిళా రక్షక్ అనే కార్యక్రమానికి పోలీసులు శ్రీకారం చుట్టారు. ఏలూరు రేంజ్ ఐజీ మార్గనిర్దేశంలో గాంధీ జయంతి రోజు ఎస్పీ డి.నరసింహ కిషోర్ పర్యవేక్షణలో ప్రారంభమైంది. పక్షం రోజుల్లోనే మంచి ఫలితాలు అందిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. మహిళల భద్రత ఒక సమస్యగా మారిన ఈ రోజుల్లో వాటిని పరిష్కారం చేసే దిశగా మహిళా రక్షక్ పేరుతో ఇటువంటి వినూత్న ఆలోచనకు బీజం పడటం మంచి పరిణామమని పలువురు పేర్కొంటున్నారు. సమస్య ఉత్పన్నమైన వెంటనే **ఫోన్ కాల్ ద్వారా ఫిర్యాదును అందుకోవడం ద్వారా ముందుగా గుర్తించి, నివారించేందుకు అవకాశం ఉంటుంది.**

క్షేత్రస్థాయికి మహిళా పోలీసులు

మహిళా రక్షక్ బృందంలో మహిళా హెచ్‌సీ, కానిస్టేబుళ్లు ఉంటారు. వీరు వాహనాలపై బృందంగా సంచరిస్తారు. కళాశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆలయాలు తదితర మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో గస్తీ కాస్తారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలతో పాటు కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తారు. ఈవ్ టీజింగ్, అమ్మాయిలను ర్యాగింగ్ చేయడం, రాత్రి సమయాల్లో మహిళల ఇబ్బందులు తదితర వాటిపై దృష్టి సారిస్తారు. ఏ ఘటన నైనా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి కంట్రోల్ రూమ్‌కు పంపుతారు. తమను ఆశ్రయించిన వారికి రక్షణగా నిలుస్తారు.

ఆపదలో ఉంటే దయల్ 112

ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు తమ రక్షణ కోసం 94932 06006 నంబర్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 112కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఈ నంబర్లు జిల్లా ఎస్పీ స్వీయ పరివేక్షణలో పని చేస్తుంటాయి. ఆ నంబర్లకు ఫోన్ చేసిన వెంటనే కాల్ సెంటర్‌లో పోలీసు ఉద్యోగులు సంబంధిత వివరాలు తీసుకుంటారు. మహిళలు, బాలికలు ఉన్న ప్రాంతానికి దగ్గరలోని పోలీస్ సిబ్బందిని పంపుతారు. దీని వల్ల తక్కువ సమయంలోనే మహిళా రక్షకులు, స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని ఆపదలో ఉన్న అతివలను రక్షించే అవకాశం ఉంటుంది. ఘటన స్థలానికి చేరుకున్న మహిళా రక్షక దళ సభ్యులు ఆ వివరాలను ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌కు తెలియపరుస్తారు. వారిచ్చే సూచనల మేరకు పని చేస్తారు. ఈ నంబర్లకు ఏ సమయంలోనైనా సహాయం కోసం ఫోన్ చేయవచ్చు.

సత్ఫలితాలు

మహిళా రక్షక్ బృందాలను ఏర్పాటు చేసిన 15 రోజుల్లో సత్ఫలితాలు వచ్చాయి. ఆపదలో, ప్రమాదంలో ఉన్న బాలికలను గుర్తించారు. వాటిలో కొన్ని ఘటనలు..

- రాజమహేంద్రవరంలో సోమవారం రాత్రి మహిళా రక్షక్ టీం గస్తీ తిరుగుతుండగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు బాలికలను గుర్తించారు. అనుమానంతో వారిని ఆపి వివరాలు అడగ్గా పొంతన లేని సమాధానం చెప్పారు. దీంతో గట్టిగా ప్రశ్నించగా తామంతా ఇన్‌స్టాగామ్‌లో స్నేహితులని, ఏదో సాధిద్దామని దూరంగా వెళ్లిపోయేందుకు ఇంట్లో వారికి చెప్పకుండా వచ్చామన్నారు. దీంతో మహిళా రక్షక్ టీం వెంటనే అప్రమత్తమైంది. ఆ బాలికల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారిని రప్పించింది. బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించింది.
- ఇద్దరు బాలికలు ఇన్‌స్టాగామ్‌లో తమకు పరిచయమైన బాలుడితో కలిసి ఇంట్లో చెప్పకుండా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్‌లో ఉన్న మహిళా రక్షక్ టీం వారిని గుర్తించింది. వివరాలు తెలుసుకుని ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లింది. వారి తల్లిదండ్రులను పిలిపించి, బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చి క్షేమంగా అప్పగించారు.
- రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న మహిళను ఒక ఆకతాయి వెంబడించాడు. ఆమె భయంతో కేకలు వేసింది. సమీపంలో పెట్రోలింగ్‌లో ఉన్న మహిళ రక్షక్ టీం క్షణాల్లో అక్కడ చేరుకుని ఆకతాయిని అదుపులోకి తీసుకుంది. అతడిని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లింది.

మహిళల భద్రతకు పెద్దపీట

మహిళల భద్రత అనేది సమాజంలోని అనేక అంశాలను ప్రభావితం చేసే క్లిష్టమైన అంశం. జిల్లాలో వారి భద్రతకు అన్ని విధాలా తగిన చర్యలు తీసుకుంటున్నాం. మహిళలపై నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళల రక్షణ కోసమే మహిళా రక్షక్ రూపుదిద్దుకుంది.

– డి.నరసింహ కిశోర్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ